
సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



పులిచింతలకు జలకళ

పులిచింతల ప్రాజెక్టులో ఈనెల 2వ తేదీ వరకు చుక్క నీరు లేకపోగా.. వారం రోజుల్లోనే నిండుకుండలా మారింది. - 8లో



పాస్ పుస్తకాలు ఇవ్వాలని ధర్నా

దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని ధర్నా చేశారు. - 9లో



అధ్వానంగా గ్రామీణ రోడ్లు

పోచంపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు వర్షాలకు అధ్వానంగా తయారయ్యాయి. - 9లో

న్యూస్‌రీల్

దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు



మాట్లాడుతున్న ఇంచార్జ్ డీఈఓ ప్రశాంత్‌రెడ్డి

భువనగిరి : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఇంచార్జ్ డీఈఓ ప్రశాంత్‌రెడ్డి సూచించారు. సోమవారం భువనగిరిలోని బగాయత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గల పెన్షనర్స్ భవనంలో దివ్యాంగ విద్యార్థులకు తెలంగాణ సమగ్ర శిక్ష, కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఉపకరణాల నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువులో రాణించడానికి ఉపకరణాలు దోహదపడుతాయన్నారు. అనంతరం శిబిరానికి హాజరైన 165 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ లింగారెడ్డి, డాక్టర్లు సునిత, సల్మాన్, మహేందర్, మెడికల్ ఆఫీసర్ విలీయం కేర్, ఆర్పీలు కిరణ్, షాజహాన్, సూర్యనారాయణ, భాస్కర్, శ్రీనివాస్, సంధ్యా, రాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

శివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలను ఆగమశాస్త్రం ప్రకారం ఘనంగా నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగాయి. వేకువజామున స్వయంభూలకు సుప్రభాత సేవ, అనంతరం అభిషేకం, తులసీ అర్చన చేశారు. అలాగే ఆలయ ప్రాకార మండపం, ముఖమండపంలో నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.

బీసీ కులగణన చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీసీ హక్కుల సాధన సమితి నాయకులు

భువనగిరిటౌన్ : బీసీ కులగణన చేపట్టాలని, బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచిన తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ ఏఓ జగన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్లెం కృష్ణ, ఏషాల అశోక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని, బీసీల సంక్షేమానికి ఏటా బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్‌కు దరఖాస్తు పెట్టుకున్న వారందరికీ రుణాలు మంజూరు చేయాలని, బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జల్ది రాములు, వెంకటేశం తదితరులు ఉన్నారు.

భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిషేధం, సైబర్ నేరాల నియంత్రణ, 100 డయల్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి సూచించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలు, చైన్ స్నాచింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలు జరిగినప్పుడు 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇంచార్జి డైరెక్టర్ సాయిలక్ష్మి, ఏఎస్‌ఐ సైదిరెడ్డి, సిబ్బంది శ్రీను, గోవర్ధన్‌నాయక్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పులే మిగిలాయి!

గ్రామాల అభివృద్ధికి రూ.లక్షల్లో ఖర్చు చేసిన సర్పంచ్‌లు

- అప్పులు తెచ్చి పనులు పూర్తి
- సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- ఏడాది క్రితం ఎంబీలు చేసి చెక్కులు ఇచ్చినా బ్యాంకుల్లో పాస్‌కాని దుస్థితి
- వడ్డీలు పెరిగి ఆర్థిక ఇబ్బందులతో మాజీ సర్పంచ్‌లు



బిల్లులు చెల్లించాలని హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్‌లు (ఫైల్)

సాక్షి యాదాద్రి : పదవీకాలంలో ఉండగా సర్పంచ్‌లు గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో విలవిలలాడుతున్నారు. అధికారులు ఏడాది క్రితం ఎంబీ రికార్డులు చేసి చెక్కులు ఇచ్చినా బ్యాంకుల్లో పాస్ కావడం లేదు. ఫలితంగా పనులు నిర్వహించడానికి తీసుకు వచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి గుదిబండలా మారుతున్నాయని మాజీ సర్పంచ్‌లు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. ఇటీవల రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ర్యాలీ కూడా నిర్వహించారు. గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రి సీతక్కకు విన్నవించారు.

చేపట్టిన పనులు ఇలా..

పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, డంపింగ్‌యార్డులు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అప్పటి ప్రభుత్వం సర్పంచ్‌లపై ఒత్తిడి పెంచింది. పనులు పూర్తి చేయించే బాధ్యత ఎంపీఓలు, ఎంపీడీఓలు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లకు అప్పగించింది. నిర్లక్ష్యం వహించిన అధికారులను ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలో సర్పంచ్‌లపై అధికారులు మరింత ఒత్తిడి పెంచారు. పనుల ప్రారంభించని పలువురు సర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చారు. కాగా క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులకు ఉపాధిహామీ నిధులు కేటాయించారు. పల్లెప్రకృతి వనాలు, నర్సరీలు, పల్లెప్రగతి, డ్రెయినేజీల నిర్మాణం, ట్రాక్టర్లు, వీధి దీపాల నిర్వహణ, విద్యుత్ బిల్లులు, పంచాయతీ సిబ్బంది వేతనాలను ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఖర్చు చేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. కానీ, వచ్చిన నిధులు దేనికీ చాలకపోవడంతో అప్పు తెచ్చి, కుటుంబ సభ్యుల బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి సర్పంచ్‌లు పనులు పూర్తి చేశారు.

చెక్కులిచ్చి చేతులు దులుపుకున్నారు

జిల్లాలోని 421 గ్రామ పంచాయతీల్లో ముఖ్యమంత్రి ప్రత్యేక అభివృద్ధి నిధులతో సీసీ రోడ్లు, అంతర్గత డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం ఎస్‌డీఎఫ్ పథకం కింద ప్రతీ పంచాయతీకి రూ.25 లక్షలు అప్పటి సర్కార్ మంజూరు చేసింది. నిధులు సరిపోవన్న ఉద్దేశంతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో సర్పంచ్‌లే పనులు పూర్తి చేయాలని అప్పటి ఎమ్మెల్యేలు, అధికారులు ఒత్తిడి చేశారు. నిధులున్నాయన్న ఆనందంలో సర్పంచ్‌లు పనులు పూర్తిచేశారు. పంచాయతీరాజ్ ఇంజనీర్లు ఎంబీ రికార్డులు చేసి గత ఏడాది చెక్కులు కూడా ఇచ్చారు. కానీ, ఇంత వరకు చెక్కులు పాస్ కాలేదు. అలాగే 2022 అక్టోబర్ నుంచి 2023 అక్టోబర్ వరకు వీధి దీపాల మరమ్మతులు, కొత్త లైట్లు వేయడం, ట్రాక్టర్ల మరమ్మతులు, జంగల్ కటింగ్, పారిశుద్ధ్యం, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం, బ్లీచింగ్, ఫినాయిల్ కొనుగోలు, బతుకమ్మ, దసరా వేడుకల నిర్వహణకు సర్పంచ్‌లే చేతినుంచి ఖర్చు చేశారు. వీటి బిల్లులకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు జారీ చేసిన చెక్కులు ట్రెజరీ నుంచి వాపస్ వచ్చాయి. వీటితో పాటు నిర్వహణ బిల్లులు రూ.లక్షల్లో రావాల్సి ఉంది.

రెండుసార్లు చెక్కు ఇచ్చారు..

రాజాపేట మండలంలోని బసంతాపురం సర్పంచ్ ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు పనులు చేశారు. ఇందుకు సంబంధించి రూ.9,18,106 బిల్లు రావాల్సి ఉంది. ఏడాది క్రితం అధికారులు ఎంబీ రికార్డులు చేసి చెక్ ఇవ్వగా బ్యాంకులో పాస్ కాలేదు. దాని కాలపరిమితి ముగియడంతో అధికారులను ప్రశ్నించగా.. ఈ ఏడాది మే 6వ తేదీన రెండోసారి చెక్కు ఇచ్చారు. చెక్కును ట్రెజరీకి పంపగా అతని ఖాతాలో ఇంతరకు డబ్బు జమ కాలేదు.

రూ.33 లక్షలు ఖర్చు చేశాను



సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, పల్లె ప్రగతి, బీసీ కమ్యూనిటీ హాల్ ఇతర పనులు కోసం సొంత డబ్బులు రూ.33 లక్షల వరకు ఖర్చు చేశాను. ఇందుకోసం భూమి అమ్మాను. రెండేళ్లయినా నిధులు వస్తలేవు. తమను ప్రభుత్వం ఇన్ని ఇబ్బందులకు గురి చేస్తుందని అనుకోలేదు.

–ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కొలనుపాక

ఎంబీ అయినా బిల్లు రాలేదు..



గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రూ. 4 లక్షలు రావాలి. 2021, 2022లో చేసిన ఎంబీ రికార్డులు ఉన్నాయి. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రి సీతక్కను కలిసి బిల్లులు ఇప్పించాలని విన్నవించాం. అయినా స్పందన లేదు.

–గుంటి మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, జాల

కిక్కిరిసిన ఎయిమ్స్



పేర్లు నమోదు చేసుకోవడానికి ఓపీ విభాగం వద్ద బారులుదీరిన రోగులు

బీబీనగర్ : రోగులతో బీబీనగర్ ఎయిమ్స్ కిక్కిరిసింది. సాధారణ రోజుల్లో 700 నుంచి వెయ్యి వరకు ఓపీ నమోదవుతుండగా సోమవారం ఒక్క రోజే సుమారు 2 వేల మంది తరలివచ్చారు. ఇందులో సాధారణ రోగాలతో బాధపడుతున్నవారితో పాటు శస్త్ర చికిత్సల కోసం వచ్చిన రోగులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. పేర్లు నమోదు చేసుకోవడానికి ఓపీ కౌంటర్ల బారులు దీరారు. అనంతరం రిపోర్టుల కోసం గంటలతరబడి నిరీక్షించారు. తీరా రిపోర్టులు వచ్చాక కొందరు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో చేసేదేమీ లేక ఇంటిబాట పట్టారు.

రెవెన్యూ సమస్యలే అధికం

- ప్రజావాణిలో వినతుల వెల్లువ
- వివిధ సమస్యలపై 72 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. 72 అర్జీలు రాగా అందులో రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. ధరణిలో వివరాలు సరిగ్గా నమోదు చేయలేదని, సర్వే నంబర్లు తప్పుగా ఉన్నాయని.. ఇలా పలు సమస్యలపై బాధితులు ఫిర్యాదు చేశారు. అదనపు కలెక్టర్లు బెన్ షాలోమ్, గంగాధర్, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ హనుమంతు కే.జెండగే బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు.

దయ చూపండయ్యా..



నా భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. మాకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద చనిపోవడంతో కుటుంబ పోషణభారంగా మారింది. సొంత ఇల్లు కూడా లేదు. భర్త ఆరోగ్యం బాగు చేయించడానికి తీసుకువచ్చిన రూ.5లక్షల అప్పు అలాగే ఉంది. నేను బీఎస్సీ, బీఈడీ పూర్తి చేశాను.. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించడయ్యా.. అంటూ చౌటుప్పల్ మండలం తూర్పుగూడేనికి చెందిన సుకన్య కలెక్టర్‌ను వేడుకుంది. ప్రజావాణికి తన ఇద్దరు పిల్లలతో కలసి వచ్చి వినతిపత్రం అందజేసింది. సమస్యను నేరుగా కలెక్టర్‌కు వివరించింది.

టీచర్లు రాక పాఠశాల మూత



ఉపాధ్యాయులు రావడం లేదని విద్యార్థులు కూడా రాకపోవడంతో తెరుచుకోని పాఠశాల

ఆత్మకూరు(ఎం) : మండలంలోని తుక్కాపురం ప్రాథమిక పాఠశాల సోమవారం ఉపాధ్యాయులు రాకపోవడంతో తెరుచుకోలేదు. పాఠశాలలో 33 మంది విద్యార్థులకు గాను ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. ఇటీవల వారిద్దరూ బదిలీ కావడంతో వేరే పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయురాలు ఇక్కడి వచ్చారు. వచ్చిన నాలుగైదు రోజులకే పదోన్నతిపై తుర్కపల్లి మండలానికి వెళ్లడంతో పాఠశాలలో ఉపాధ్యాయులు లేకుండాపోయారు. ఈనెల 1వ తేదీన సీఆర్‌పీని నియమించగా ఐదు తరగతులను ఒక్కరే చూస్తున్నారు. ఇటీవల సింగారం పాఠశాల ఉపాధ్యాయుడికి డిప్యూటేషన్ వేయగా తుక్కాపురం వెళ్లనని సెలవుపెట్టాడు. ఫలితంగా ఉపాధ్యాయులు రావడం లేదంటూ సోమవారం విద్యార్థులు కూడా పాఠశాలకు వెళ్లడం మానేశారు. దీంతో పాఠశాల తలుపులు తెరుచుకోలేదు. విషయం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు సమీపంలోని తిమ్మాపురం పాఠశాల నుంచి మరో ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై పంపినా ఫలితం లేకపోయింది.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి



భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

- అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా

భువనగిరి రూరల్ : నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను డ్రా పద్ధతిలో కేటాయించి లబ్ధిదారులకు పట్టాలు కూడా అందజేశారని, ఎన్నికల కోడ్ రావడంతో పొజిషన్ చూపలేదన్నారు. తక్షణమే లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. తహసీల్దార్ వచ్చి త్వరలోనే ఇళ్లు అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ఆబోతుల కిరణ్, దిడ్డికాడి భగత్, బట్టుపల్లి అనురాధ, సుభాష్, బట్టు రాంచంద్రయ్య, మాయ కృష్ణ, బబ్లూ, కుతాడి అశోక్, ఏషాల అశోక్, పుట్ట రమేష్, చింతల మల్లేష్, చందా మహేందర్, రత్నపురం బలరాం తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలపై అపోహలు నమ్మవద్దు



మెడికల్ కళాశాల ఏర్పాటుకు మల్లాపురంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్ : ఎన్ని అడ్డంకులు ఎదురైనా మల్లాపురంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి తీరుతామని, అపోహలను నమ్మొద్దని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకోసం సోమవారం యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో కలెక్టర్ హనుమంతు కే.జెండగేతో కలిసి భూములను పరిశీలించారు. గ్రామంలోని సర్వే నంబర్ 64లో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టడానికి 20 ఎకరాల భూమి అనువుగా ఉందన్నారు. ఇందులో త్వరలోనే పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. మెడికల్ కాలేజీని వేరే జిల్లాకు తరలిస్తున్నారని ప్రతిపక్ష నాయకులు ప్రచారం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అమరేందర్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వేయర్ దేవా, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, ముఖ్యర్ల మల్లేష్, కర్రె వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికల నిర్వహణ అస్తవ్యస్తం

మూడేళ్లుగా నిలిచిపోయిన నిధులు

- జిల్లాలో రూ.2.98 కోట్ల బకాయిలు
- వీడియో కాన్ఫరెన్స్‌లతో అదనపు భారం
- చేతినుంచి ఖర్చు చేస్తున్న ఏఈఓలు



నిర్వహణ లేని రామన్నపేట రైతువేదిక



మునిపంపుల రైతువేదిక వద్ద అపరిశుభ్రత

రామన్నపేట : లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతువేదికల నిర్వహణ గాలికొదిలేశారు. మూడేళ్లుగా నిర్వహణ నిధులు రాకపోవడంతో వ్యవసాయ అధికారులే చేతినుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది. కొందరు పట్టించుకోకపోవడంతో రైతువేదికలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. రైతులు సమావేశాలు నిర్వహించుకుని పంటల సాగులో కొత్త విధానాలతో పాటు అధికారుల సూచనలు, సలహాలు తెలుసుకునేందుకు వీలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో వ్యవసాయ క్లస్టర్ల వారీగా 92 రైతు వేదికలు నిర్మించింది. ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి రూ.22 22లక్షలు ఖర్చు చేసింది. 36 నెలలుగా పైసా కూడా రాకపోవడంతో వాటి నిర్వహణ వ్యవసాయ అధికారులకు భారంగా మారింది.

నిర్వహణ ఖర్చులు ఇలా..

రైతు వేదికల నిర్వహణ బాధ్యతను అప్పటి ప్రభుత్వం ఏఈఓలకు అప్పగించింది. నిర్వహణ ఖర్చుల కింద ఒక్కో రైతు వేదికకు ప్రతి నెలా రూ.9,000 విడుదల చేయాల్సి ఉంది. ఈ నిధుల్లో పరిశుభ్రతకు రూ.3వేలు, రైతుల శిక్షణ తరగతులకు రూ.2,500, స్టేషనరీ జిరాక్స్‌లకు రూ.1,000, విద్యుత్ బిల్లులు రూ.1,000, ఏవైనా మరమ్మతులు తలెత్తితే సరి చేసేందుకు రూ.1000, తాగునీటికి రూ.500 ఖర్చు చేయాల్సి ఉంది. రైతు వేదికలు ఉపయోగంలోకి వచ్చి సుమారు 41 నెలలు కావస్తుంది. ప్రారంభంలో ఐదు నెలల పాటు నిర్వహణ బిల్లులు చెల్లించారు. ఆ తరువాత పైసా కూడా రాలేదు.

ఏఈఓలే స్వీపర్లు

తక్కువ వేతనానికి రైతువేదికలను ఊడ్చడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదు. దీంతో కొన్నిచోట్ల ఏఈఓలే చీపురు చేత పట్టి శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏఈఓలు పట్టించుకోని రైతువేదికల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. దీంతో పాటు ఆఫీస్ సబార్డినేట్లను కూడా నియమించకపోవడంతో రైతువేదికల తాళం తీసింది మొదలుకొని డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్లే వరకు అన్నీ తామై వ్యవహరించాల్సి వస్తుందని ఏఈఓలు వాపోతున్నారు. సరైన నిర్వహణ లేకపోవడంతో కొన్ని చోట్ల దర్వాజలు, కిటికీలు చెదలు పడుతున్నాయి. మరోవైపు గ్రామాలకు దూరంగా నిర్మించిన రైతువేదికలకు భద్రత లేకుండాపోయింది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం నుంచి నెలనెలా నిధులు రావాల్సి ఉంది. గత కొంత కాలంగా నిధులు విడుదల చేయకపోవడం వల్ల వేదికల నిర్వహణలో ఏర్పడుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమానికి కరెంట్ తప్పనిసరి కావడంతో విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య తలెత్తకుండా చూస్తున్నాం. త్వరలోనే ప్రభుత్వం నిధులు మంజూరు చేసే అవకాశం ఉన్నది.

–అనురాధ, జిల్లా వ్యవసాయాధికారి

విద్యుత్ బిల్లుకూ కటకట

కొంతకాలంగా వ్యవసాయశాఖ ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తోంది. దీనికి కరెంట్ తప్పనిసరి. ఇప్పటికే రైతువేదికల నిర్వహణ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని, వీడియో కాన్ఫరెన్స్‌లతో ఖర్చు తడిసిమోపడు అవుతుందని ఏఈఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి ఉందని, నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

భువనగిరి ఖిలాపై విద్యార్థుల సందడి

భువనగిరి : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 55 మంది సోమవారం భువనగిరి ఖిలాను సందర్శించారు. కోట గోడ, చారిత్రక కట్టడాలను తిలకించారు. వాటి విశిష్టతను సహాయకుడి ద్వారా తెలుసుకున్నారు. అనంతరం పలువురు విద్యార్థులు ర్యాప్లింగ్, జిప్‌లైన్ ప్రాక్టీస్ చేశారు. సాహస క్రీడలకు భువనగిరి ఖిలా అనువుగా ఉందన్నారు. రాక్ క్లైంబింగ్ ట్రైనింగ్ స్కూల్ నిర్వాహకులు శేఖర్‌బాబు, పూర్ణ, ఆనంద్, అన్వితారెడ్డి, రాకేశ్ పర్యవేక్షణలో శిక్షణ కొనసాగింది.



ఖిలాను సందర్శించిన హైదరాబాద్ విద్యార్థులు

దేశభక్తిని పెంపొందించేందుకే తిరంగా ర్యాలీ



భువనగిరిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం, బీజేపీ నాయకులు

భువనగిరి : యువతలో దేశభక్తిని పెంపొందించేందుకే తిరంగా ర్యాలీలు చేపడుతున్నట్లు బీజేవైఎం రాష్ట్ర ప్రభారి కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో భువనగిరిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత దేశ భక్తిని పెంపొందించకుని జాతీయతావాదులుగా మారాలని, దేశ ద్రోహులను తరిమికొట్టడానికి ఏకం కావాలని సూచించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, నాయకులు మల్లికార్జున్, శ్రీధర్, బట్టు కాంత్రి, నరేష్, నర్సింగ్‌రావు, ప్రవీణ్, నందు, స్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాగర్ ఎడమ కాలువలో మృతదేహం లభ్యం



కాలువ నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న గజ ఈతగాళ్లు

చిలుకూరు, గరిడేపల్లి : సాగర్ ఎడమ కాలువలో మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన చిలుకూరు మండల పరిధిలోని పోలేనిగూడెం అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని జరిగింది. వివరాలు.. హుజూర్‌నగర్‌కు చెందిన లచ్చి మాల వెంకట్ (21) ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో ఓ వివాహానికి వచ్చి సాగర్ కాలువలో ఈతకు దిగి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. సోమవారం ఉదయం పోలేనిగూడెం అగ్రికల్చర్ కళాశాల సమీపాన సాగర్ కాలువలో శవమై తేలాడు. కాలువ పక్క నుంచి వెళ్తున్న పలువురు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సహాయంతో బయటకు తీశారు.

రేషన్ బియ్యం పట్టివేత



వలిగొండ : పట్టుబడిన బియ్యంతో అధికారులు

వలిగొండ : మండలంలోని చిత్తాపురం గ్రామంలో నోముల మత్స్యగిరికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో గల షెడ్డులో నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వివరాలు.. భువనగిరి మండలంలోని పచ్చర్లబోడుతండాకు చెందిన ధరావత్ మహేందర్ అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని చిత్తాపురం గ్రామంలో నోముల మత్స్యగిరికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సివిల్ సప్లై విజిలెన్స్ అధికారులు దాడి జరిపి 52 క్వింటాళ్ల బియ్యం పట్టుకుని మహేందర్‌పై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్థానిక పోలీసులకు అప్పచెప్పారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ షేక్ గౌస్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ బాలమణి, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ, ఆటో ట్రాలీలో తరలిస్తుండగా..

మిర్యాలగూడ టౌన్ : ఒక లారీ, ఒక ట్రాలీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన సోమవారం రాత్రి మిర్యాలగూడ మండలంలో చోటుచేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు నమ్మదగిన సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు మిర్యాలగూడ మండలం జంకుతండాలోని లక్ష్మి మినీ రైస్ మిల్లు వద్దకు వెళ్లగా అప్పుడే లారీ, ట్రాలీలో లోడ్ చేసి తరలిస్తుండగా 200 క్వింటాళ్ల (390 బస్తాలు) రేషన్ బియ్యం పట్టుకున్నారు. మినీ రైస్‌మిల్లు నిర్వాహకుడితోపాటు ట్రాలీ, లారీ డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిల్వ ఉంచిన బియ్యం..

మిర్యాలగూడ అర్బన్ : అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రమణ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి తరలించేందుకు యత్నిస్తున్నాడనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేశారు. ఒక షెడ్డులో నిల్వ ఉంచిన సుమారు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అరుదైన వ్యాధితో అష్టకష్టాలు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద మహిళ
- అప్పులు చేసి చికిత్స చేయిస్తున్న భర్త
- దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమ్యశ్రీ

బుషిపాక రమేష్, గ్రామం : ముశిపట్ల
మండలం : మోత్కూరు
ఫోన్ పే నంబర్ : 79899 35744
గూగుల్ పే నంబర్ : 99485 49435

కన్నీటి గాధ

మోత్కూరు : నిరుపేద కుటుంబానికి పెద్ద ఆపద వచ్చింది. తన భార్యకు వచ్చిన అరుదైన వ్యాధికి చికిత్స అందించేందుకు భర్త నానా కష్టాలు పడుతున్నాడు. భర్త ప్రైవేట్ ఫైనాన్స్‌లో పనిచేస్తుండగా భార్య వ్యవసాయ పనులకు వెళుతూ ముగ్గురు పిల్లలతో జీవనం గడుపుతున్నారు. ఆ నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ అకస్మాత్తుగా అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దాతలు ముందుకు వచ్చి ప్రాణభిక్ష పెట్టాలని ఆమె భర్త, పిల్లలు వేడుకుంటున్నారు. మోత్కూరు మండలంలోని ముశిపట్ల గ్రామానికి చెందిన బుషిపాక రమ్యశ్రీ–రమేష్ దంపతులది దళిత నిరుపేద కుటుంబం. సుమారు 13 సంవత్సరాల క్రితం వీరి వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు సంతానం. గౌతమ్, కౌశిక్, ఉజ్వల్ 12 సంవత్సరాల లోపు వయస్సు వారే. ఇద్దరు కుమారులు ప్రభుత్వ గురుకులం, చిన్న కుమారుడు స్థానికంగా ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. వారసత్వంగా వచ్చిన అర ఎకరం అసైన్డ్ భూమియే వీరి ఆస్తి. స్వగ్రామంలో నిత్యం భార్య వ్యవసాయ పనులకు వెళుతుండగా భర్త మోత్కూరులోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో కలెక్షన్ ఎగ్జిక్యూటీవ్‌గా పనిచేస్తూ నెలకు రూ.13 వేలు సంపాదిస్తున్నాడు.

ఆకస్మికంగా జ్వరం రావడంతో..


బుషిపాక రమ్యశ్రీ 2023 మార్చి నెలలో ఆకస్మికంగా తీవ్ర జ్వరంతో అనారోగ్యం బారిన పడింది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. రక్త కణాలు భారీగా పడిపోవడంతో రూ.50 వేలు చికిత్స కోసం ఖర్చు చేశారు. ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన రాత్రే మళ్లీ ఆమెకు తీవ్ర జ్వరం వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. మళ్లీ రక్త కణాలు భారీగా పడిపోయాయి. దీంతో ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో 3 రోజుల పాటు అత్యవసర విభాగంలో చేర్పించి చికిత్స అందించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి రమ్యశ్రీకి తంబోతెరపిక్ పుర పుర అనే అరుదైన వ్యాధి సోకిందని వైద్యులు నిర్ధారించి కుటుంబ సభ్యులకు తెలిపారు. మిలియన్ల మందిలో అరుదుగా వచ్చే వ్యాధి అని, పూర్తి నిర్మూలన లేదని వైద్యులు ధృవీకరించారు. తాత్కాలిక నివారణకు ఖరీదైన వైద్య చికిత్స అందించాలని తెలిపారు. దీనికి తోడు రమ్యశ్రీకి హెర్నియా వ్యాధి ఏర్పడింది. దీంతో మూడు, నాలుగు లక్షలు వెచ్చించి హెర్నియా శస్త్ర చికిత్స చేయించారు. ఈ ఆపరేషన్ చేయడంతో ఎడమ చేయి, కాలు, మూతి వంకర పోయి మళ్లీ తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోవడంతో ప్రస్తుతం మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె చలనం లేని స్థితిలో ఉంది. బ్లడ్ లెవల్స్ క్షీణించడం వల్ల రోజూ ప్లాస్మా సెల్స్ (బ్లడ్ సెల్స్) ఎక్కిస్తున్నారు. దీని కోసం ప్రతిరోజు పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చవుతోంది. ఏడాదిన్నర కాలంగా అప్పులు చేసి వైద్యం చేస్తున్నారు. ఉన్న అర ఎకరం భూమి అమ్మడానికి సిద్ధపడ్డారు. రమ్యశ్రీ వైద్యానికి ఆమె కుటుంబ సభ్యులు నానా బాధలు పడి సర్వస్వం కోల్పోయారు. చేతిలో డబ్బులు లేక తన భార్య ప్రాణాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియక ఆమె భర్త రమేష్ పడే బాధలు వర్ణనాతీతం.

చికిత్స కోసం రూ. 20 లక్షలు అప్పు చేశా..

నా భార్యకు వచ్చిన అరుదైన వ్యాధి చికిత్స కోసం అప్పులు చేసి రూ.20 లక్షలకు పైగా పెట్టాను. ఈ అరుదైన వ్యాధి తిరిగి వచ్చే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఐసీయూలో జాయిన్ అయితే రోజుకు సుమారు రూ.లక్ష ఖర్చవుతాయి. ఈ వ్యాధికి ఆపరేషన్ లేదని, నియంత్రించడమే చికిత్స అని, ఖరీదైన వైద్యం అని చెప్పారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేసి నా భార్య చికిత్సకు సహాయ పడాలని కోరుతున్నారు.

– బుషిపాక రమేష్, రమ్యశ్రీ భర్త

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ప్రమాదంలో మృతిచెందిన శ్రీనాథ్

మిర్యాలగూడ : లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన దామరచర్ల మండల కేంద్రంలోని అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. వాడపల్లి ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌కు చెందిన ఆదిపూడి శ్రీనాథ్(40) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య సింధు, కుమారుడు, కుమార్తె గుంటూరులో ఉంటున్నారు. ఈ క్రమంలో శ్రీనాథ్‌కు రెండు రోజులు సెలవులు రావడంతో శుక్రవారం గుంటూరులోని తన భార్య వద్దకు వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం తన కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. దామరచర్ల మండల కేంద్రానికి చేరుకునేసరికి కారు వేగంగా డివైడర్‌ను తాకి రోడ్డును దాటి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టడంతో శ్రీనాథ్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సింధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



మధు (ఫైల్)

భువనగిరి క్రైం : రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయగిరి–వంగపల్లి రైల్వే స్టేషన్ మధ్యలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం సికింద్రాబాద్ నుంచి సిరిపూర్ కాగజ్‌నగర్ వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి 246/28–30 మైలురాయి వద్ద సుమారు 25–30 సంవత్సరాల వయస్సు గల రాయగిరి గ్రామానికి చెందిన లస్కర్ మధు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబల్ జె.కృష్ణారావు తెలిపారు. వివరాలకు 9848222169 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మేకలను అదిలించడానికి వెళ్లి...

మిర్యాలగూడ అర్బన్: రైలు పట్టాలపైకి వెళ్లిన మేకలను అదిలించడానికి వెళ్లిన వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం మిర్యాలగూడ మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం రాఘవపురం తండాకు చెందిన రమావత్ పాండు(60) మేకలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే సోమవారం కూడా తన మేకలను మేతకు తోలుకుని వెళ్లాడు. కాగా మేకలు గడ్డిని మేస్తూ సమీపంలోని రైలు పట్టాలపైకి వెళ్లాయి. గమనించిన పాండు వాటిని అదిలించేందుకు రైలు పట్టాలపైకి చేరుకున్న సమయంలో రైలు వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో పాండుతోపాటు రెండు మేకలు కూడా మృతి చెందాయి. పాండుకు చెవుడు ఉందని అందుకే రైలు కూత వినిపించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు ప్రమాద వివరాలను సేకరించారు. మృతుడికి భార్య సక్రితోపాటు ఇద్దరు కుమారులున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

గ్యాస్ లీకై వాహనం దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తిప్పర్తి : వాహనంలో ఉండే ఎల్‌పీజీ గ్యాస్ లీకై మారుతి వ్యాన్ దగ్ధమైన సంఘటన తిప్పర్తి పరిధిలోని చిన్నాయిగూడెం సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. తిప్పర్తి మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన బాధితుడు సుంకర బోయిన రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తన మారుతి వ్యాన్‌ను నల్లగొండకు తీసుకెళ్లి రిపేరు చేయించుకుని తిరిగి స్వగ్రామం సర్వారంకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిన్నాయిగూడెం సమీపంలోకి రాగానే గ్యాస్ వాసన రావడంతో గమనించి వాహనాన్ని పక్కకు ఆపగా అప్పటికే వాహనం కింది నుంచి మంటలు చెలరేగాయి. తనతోపాటు మరో ఇద్దరు మిత్రులు వాహనంలో నుంచి కిందికి దిగి వెంటనే 100 ఫోన్ చేయగా తిప్పర్తి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి గాయాలు

బొమ్మలరామారం : రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలైన సంఘటన బొమ్మలరామారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం యాద్గారిపల్లి గ్రామానికి చెందిన జి.సంజీవ అనే వ్యక్తి బొమ్మలరామారం మండలంలోని రామలింగంపల్లి గ్రామానికి చెందిన తన బావమరిది సల్ల కిరణ్ ఇంటికి ఆదివారం బోనాల పండుగకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా రామలింగంపల్లి శివారులో సంజీవ బైక్‌ను కేశవపూర్ గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తి బైక్‌తో ఢీ కొట్టాడు. ఘటనలో గాయాలపాలైన సంజీవను ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బావమరిది కిరణ్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటు పోలీసులు తెలిపారు.

కుంగ్‌ఫూ పోటీల్లో గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న అభినవ్

నల్లగొండ టూటౌన్ : విజయవాడలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే కుంగ్‌ఫూ పోటీల్లో నల్లగొండ పట్టణానికి చెందిన క్రీడాకారుడు పందుల అభినవ్ విజయం సాధించి గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ కైవసం చేసుకున్నాడు. పోటీల్లో గెలుపొందిన షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియాకు చెందిన క్రీడాకారుడు అభినవ్‌కు షాడోస్ కుంపు గ్రాండ్ మాస్టర్ పి.మురళీధర్‌రావు, సుమన్ షోటోఖాన్ ఫౌండర్ బూడిద సైదులు, టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ బి. వెంకట్ సోమవారం గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఫౌండర్ నాంపల్లి కనకారావు పాల్గొన్నారు.

ఆలయ హుండీ చోరీ

రామన్నపేట : మండల కేంద్రం నుంచి దుబ్బాక గ్రామానికి వెళ్లే మార్గంలో గల వంకబయ్యన్న ఆలయం హుండీ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. గుర్తు తెలియని దుండగులు ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించి హుండీని పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. హుండీని పక్కన గల పొలాల్లో పడేసిపోయారు. హుండీలో రూ.10వేల వరకు నగదు ఉండవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రెండు నెలల క్రితం ఇదే ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు.

కిరాణ షాపులో..

నడిగూడెం : తాళం వేసిన కిరాణ షాపులో రూ.25 వేలు చోరీ జరిగిన సంఘటన సోమవారం తెల్లవారుజామున నడిగూడెం మండల కేంద్రంలో జరిగింది. బాధితుడు పిడమర్తి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు తన కిరాణ షాపు తాళం పగులగొట్టి, షాపులో ఉన్న రూ.25 వేలు నగదు చోరీ చేశారని తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు.

భువనగిరి బస్టాండ్‌లో ..

భువనగిరి క్రైమ్ : బ్యాగ్‌లో నుంచి పర్సును దొంగిలించిన సంఘటన సోమవారం భువనగిరి బస్టాండ్‌లో జరిగింది. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన సరోజినీదేవి బస్సులో జనగామ వెళ్తూ తన సోదరి కోసం భువనగిరి బస్టాండ్‌లో బస్సు దిగింది. ఇద్దరు కలిసి మరో బస్సులో ఎక్కుతుండగా బ్యాగులో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పర్సు దొంగిలించారు. ఈ మేరకు బాధితురాలు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పర్సులో బంగారు ఆభరణాలతోపాటు, నగదు ఉందని సరోజినీదేవి పేర్కొంది.

విద్యుదాఘాతంలో రైతుకు గాయాలు

ఆత్మకూరు(ఎం): విద్యుదాఘాతంలో ఓ రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆత్మకూరు(ఎం) మండల పరిధిలోని పల్లెపహాడ్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పల్లెపహాడ్‌లో వ్యవసాయ బావి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఈ నెల 2న రైతులు మోత్కూరులోని రిపేరు సెంటర్‌కు తీసుకుపోయి బాగు చేయించుకొచ్చాడు. ట్రాన్స్‌ఫార్మర్ కింద సుమారు 15 వరకు వ్యవసాయ బావుల ఉన్నాయి. మరుసటి రోజు 3న వ్యవసాయ బావి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడం కోసం ఇన్‌చార్జ్ లైన్‌మెన్ వెంకన్నకు రైతు గజెల్లి పరుశరాములు ఫోన్ చేశారు. అయితే లైన్‌మెన్ వెంకన్నకు గుండాల మండలం సుద్దాల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి పారుపల్లి, సారగండ్లగూడెం గ్రామాలు ఉన్నాయి. సారగండ్లగూడెంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో లైన్‌మెన్ అక్కడే ఉండిపోయారు. దీంతో పల్లెపహాడ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని స్థానికంగా ఉన్న ప్రైవేట్ వ్యక్తి ముత్తయ్యకు చెప్పారు. ఎల్‌సీ తర్వాత తీసుకుందామని ముత్తయ్యతోపాటు రైతులు ట్రాన్స్‌ఫార్మర్ అమర్చుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో రైతు గజెల్లి శంకరయ్య విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం శంకరయ్యను వెంటనే జనగామలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యుదాఘాతానికి గురైన రైతు ప్రస్తుతం ఇంటి వద్ద చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయమై లైన్‌మెన్ వెంకన్నను వివరణ కోరగా.. ట్రాన్స్‌ఫార్మర్ అమర్చే విషయంలో గ్రామానికి చెందిన రైతులు ఎల్‌సీ కోసం ఫోన్ చేయలేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ అమర్చుతున్నట్లు ఉదయం ఒకసారి ఫోన్ చేశారని చెప్పారు. తాను సుద్దాల సబ్ స్టేషన్ పరిధిలో పారుపల్లి, సారగండ్లగూడెంలో లైన్‌మెన్‌గా పని చేస్తుంటానని, పల్లెపహాడ్‌గా ఇన్‌చార్జ్‌గా మాత్రమే ఉన్నానని అన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

కోదాడరూరల్ : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష పడినట్లు పట్టణ సీఐ టి.రాము సోమవారం తెలిపారు. కోదాడ పట్టణానికి చెందిన బత్తిన సత్యనారాయణ మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరు పరుచగా సెకండ్ మెజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

వేర్వేరుచోట్ల నలుగురు ఆత్మహత్య

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వివిధ కారణాలతో వారు బలవన్మరణానికి పాల్పడ్డారు



కృష్ణ (ఫైల్)

పెద్దవూర : అప్పుల బాధతో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం పెద్దవూర మండలంలోని చింతపల్లి గ్రామ పంచాయతీ పరిధి చింతపల్లితండాలో చోటుచేసుకుంది. పోలీసులు, తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన జటావత్ కృష్ణ(40) తనకున్న ఐదెకరాల వ్యవసాయ భూమితోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న భూమిలో బత్తాయి తోట సాగు చేస్తుండగా, కౌలుకు తీసుకున్న పొలంలో మిర్చి, పత్తి పంటలు సాగు చేస్తున్నాడు. గత ఏడాది తీవ్ర వర్షాభావంతో తనకున్న వ్యవసాయ బోర్లు ఎండిపోయాయి. తోటను కాపాడుకోవడానికి ఈ ఏడాది నాలుగు బోర్లు సైతం వేయించాడు. అయినా ఒక్కదానిలో కూడా చుక్క నీరు పడలేదు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన బత్తాయి తోట తీరా పంట చేతికి వచ్చే దశలో బోర్లు ఎండిపోవడం, వేసిన బోర్లలో నీరు పడకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. వ్యవసాయం కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండడం, అప్పులు ఇచ్చిన వ్యక్తులు డబ్బులు అడుగుతుండడంతో అప్పు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనస్థాపానికి గురై సోమవారం ఉదయం ఇంటినుంచి వెళ్లి మండలంలోని పెద్దగూడెం స్టేజీ సమీపంలో క్రిమి సంహారక మందు సేవించాడు. అతడి నడకలో తేడా రావడం, నత్తినత్తిగా మాట్లాడుతుండడంతోపాటు నోటినుంచి దుర్వాసన వస్తుండడంతో తెలిసిన వ్యక్తులు క్రిమి సంహారక మందు సేవించినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించడంతో వారు అక్కడికి వచ్చి చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలిస్తుండగా కృష్ణ మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.వీరబాబు తెలిపారు.

కుటుంబ కలహాలతో..



కవిత (ఫైల్)

అడ్డగూడూరు : పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం అడ్డగూడూరు మండల పరిధిలోని కంచనపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కంచనపల్లి గ్రామానికి చెందిన బాషబోయిన యాదగిరి భార్య బాషబోయిన కవిత (30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం యాదగిరి పత్తి చేనుకు కొట్టడానికి పురుగుల మందు తెచ్చి ఇంట్లోపెట్టి బయటికి వెళ్లాడు. కవిత ఆ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి ఈ విషయాన్ని భర్త యాదగిరికి తెలిపారు. అప్పటికే కవిత స్పృహ కోల్పోయి ఉండడంతో చికిత్స కోసం తిరుమలగిరి మండలంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలి సోదరుడు కదారి సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరివేసుకుని కార్మికుడు ..

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని శ్రీని ఫార్మా కంపెనీకి చెందిన వలస కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ అశోక్‌రెడ్డి సోమవారం తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కాట్ని జిల్లా తిరువాపుర్ గ్రామానికి చెందిన సోనుపాటిల్(23) కొంత కాలంగా తన సోదరుడైన దీపక్‌పాటిల్‌తో కలిసి శ్రీని పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇదే పరిశ్రమలో కంపెనీకి చెందిన క్వార్టర్‌లో ఉంటున్నారు. ఆ క్రమంలో శనివారం తన సోదరుడు స్వగ్రామానికి బయలుదేరాడు. మరుసటి రోజు సాయంత్రం సమయంలో సోనుపాటిల్ తన సోదరుడికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నాని చెప్పి పెట్టేశాడు. వెంటనే అప్రమత్తమైన అతడి సోదరుడు పక్క గదిలో ఉండే సహచరులకు సమాచారం అందించాడు. వెంటనే వెళ్లి కాపాడాలని కోరాడు. వారంతా వెళ్లి చూడగా తలుపులు వేసి ఉన్నాయి. బలవంతంగా తలుపులు తెరిచి లోనికి వెళ్లి చూడగా అప్పటికే సోనుపాటిల్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయి ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఉరేసుకుని మాజీ సర్పంచ్..

గుర్రంపోడు : ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం గుర్రంపోడు మండలంలోని పోచంపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. పోచంపల్లి గ్రామానికి చెందిన జాల ఎల్లమ్మ(40) ఇంట్లోనే గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన నల్లగొండ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతురాలు గతంలో గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆత్మహత్య ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.


ఉత్తర మాడ వీధిలో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు



ఉత్తర మాడ వీధిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ఉత్తర మాడ వీధిలో తాత్కాలిక షెడ్డు (టెంటు)ను అధికారులు ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో భక్తుల ఇబ్బందులను గుర్తించిన అధికారులు దాతల సహకారంతో తాత్కాలిక షెడ్డు వేశారు. వేసవి ముగిసిన అనంతరం వర్షాకాలం ప్రారంభమైన తరువాత ఈ షెడ్డును తొలగించారు. తిరిగి ఎండలు మండుతున్న నేపథ్యంలో భక్తుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు మరోసారి ఉత్తర మాడ వీధిలో తాత్కాలిక షెడ్డును అధికారులు ఏర్పాటు చేశారు.

పులిచింతల ప్రాజెక్టుకు జలకళ..



ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టు ఇలా..

హుజూర్‌నగర్ : చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు వారంరోజుల్లోనే నిండుకుండలా మారింది. ఈ నెల 2వ తారీఖు వరకు కూడా పులిచింతల ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోయింది. అప్పటివరకు ప్రాజెక్టులో 1.15 టీఎంసీ నీరు మాత్రమే నమోదైంది. ఆ తర్వాత 3, 4వ తేదీల్లో కృష్ణా నది ఎగువ ప్రాంతాల నుంచి అనూహ్యంగా వరద రావడం మొదలైంది. దీంతో 5వ తేదీన ప్రాజెక్టులోని 4 క్రస్ట్ గేట్లను పైకి ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. అప్పటినుంచి వరద పోటెత్తుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 33.80 టీఎంసీల నీటితో జలకళ సంతరించుకుంది.

పులిచింతల ప్రాజెక్టు గేట్లు మూసివేత

పులిచింతల ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను అధికారులు సోమవారం మూసివేశారు. ఎగువ నుంచి వస్తున్న వరద నిలిచిపోవడంతో గేట్ల ద్వారా నీటి విడుదల నిలిపివేశారు. విద్యుత్ కేంద్రానికి 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 37.27 టీఎంసీల నీరు ఉంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 53.34 మీటర్లు కాగా ప్రస్తుతం 51.58 మీటర్ల నీటి మట్టం ఉంది. ప్రాజెక్టులో 175 అడుగులకు గాను 169.22 అడుగుల వరకు నీరు ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చింతపల్లి : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చింతపల్లి మండల పరిధిలోని ప్రశాంతపురితండా వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన ప్రకారం.. ప్రశాంతపురితండా శివారులోని హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి పక్కన కేతావత్ చంద్రు తన వ్యవసాయ పొలంలో సుమారు 25 సంవత్సరాల వయస్సు గల ఓ వ్యక్తి మృతదేహం గుర్తించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు. మృతుడి వివరాలు తెలిసినవారు చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కొడుకుపై తల్లిదండ్రుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వృద్ధ దంపతులు

నేరేడుచర్ల : తమ పుట్టింటి ద్వారా సంక్రమించిన భూమిని సేద్యం చేయనివ్వకుండా తమ కొడుకు అడ్డుకుంటున్నాడని, న్యాయం చేయాలని కోరుతూ సోమవారం వృద్ధ దంపతులు తహసీల్దారు సురగి సైదులుకు వినతి పత్రాన్ని అందజేశారు. వివరాలు.. గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామానికి చెందిన నెమ్మాని భారతమ్మ–బ్రహ్మయ్య భార్యాభర్తలు. భారతమ్మకు ఆమె తల్లిదండ్రులు నేరేడుచర్ల మండలం దాసారం గ్రామంలో అరెకరం భూమి ఇచ్చారు. అయితే ఆ భూమిలో సేద్యం చేసుకుందామని వెళితే తమ కుమారుడు అయిన నెమ్మాని వెంకటేశ్వర్లు తమపై దాడులకు పాల్పడుతున్నాడని తెలిపారు. అదేవిధంగా గరిడేపల్లి మండలం లింగాల శివారులో తమ పేరున మరో అరెకరం భూమి కూడా ఉందని, వీటి పట్టాలను ఇవ్వాలని వేధింపులకు గురి చేస్తున్నాడని ఆ దంపతులు వాపోయారు. ఇప్పటికే తమ కుమారుడు వెంకటేశ్వర్లుకు 23 గుంటల భూమి పట్టా చేశామని, ఉన్నదంతా ఆయనకే ఇస్తే తాము ఎలా బతకాలని తహసీల్దారుకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.